సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు
బుధవారం । 5 । ఫిబ్రవరి । 2025



సోమశిలలో 66.189 టీఎంసీలు

సోమశిల: జలాశయంలో మంగళవారం 66.189 టీఎంసీల నీరు నిల్వ ఉంది. జలాశయం నుంచి వివిధ కాలువలకు 3950 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రా)	రూ.85,780
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రా)	రూ.7,792
మూడు శాతం జీఎస్టీతో	రూ.8,026
సవర (8 గ్రాములు)	రూ.64,208

గరిష్టం/కనిష్టం
34.2 /22.2

వాతావరణం

బుధవారం జిల్లాలో వాతావరణం సాధారణంగా ఉంటుందని ఆ శాఖ అధికారులు తెలిపారు. గాలిలో తేమ మంగళవారం 61 శాతంగా నమోదైంది.

న్యూస్‌రీల్

నేటి నుంచి ఒకేషనల్ ప్రాక్టికల్ పరీక్షలు

- 21 కేంద్రాల ఏర్పాటు
- హాజరుకానున్న 2,275 మంది విద్యార్థులు

నెల్లూరు (టౌన్): ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరాలకు సంబంధించి ఒకేషనల్ ప్రాక్టికల్ పరీక్షలు బుధవారం నుంచి ప్రారంభం కానున్నాయి. తొలివిడతగా 5 నుంచి 9వ తేదీ వరకు, రెండో విడత 11 నుంచి 14వ తేదీ వరకు, మూడో విడత 15 నుంచి 19వ తేదీ వరకు ఈ పరీక్షలు జరగనున్నాయి. జిల్లా వ్యాప్తంగా 21 కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించనున్నారు. ప్రథమ సంవత్సరం 1,245 మంది, ద్వితీయ సంవత్సరం 1,030 మంది కలిపి మొత్తం 2,275 మంది విద్యార్థులు హాజరుకానున్నారు. ఈ ప్రాక్టికల్స్‌కు సంబంధించి అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఇందు కోసం జిల్లా పరీక్షల కమిటీని కూడా ఏర్పాటు చేశారు.

స్వచ్ఛంద సేవా సంస్థలకు ఆహ్వానం

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): జిల్లాలో గిరిజన సంక్షేమం కోసం పని చేసేందుకు నాన్ గవర్నమెంట్ ఆర్గనైజేషన్, వలంటరీ ఆర్గనైజేషన్స్ నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా గిరిజన సంక్షేమ శాఖాధికారి పరిమళ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2024–25 సంవత్సరానికి గ్రాంట్ ఇన్ ఎయిడ్ టు వలంటరీ ఆర్గనైజేషన్ వర్కింగ్ ఫర్ వెల్ఫేర్ ఆఫ్ షెడ్యూల్డ్ ట్రైబ్స్ పథకం ద్వారా విద్య, ఆరోగ్యం, జీవనోపాధుల సేవలను అందించేందుకు స్వచ్ఛంద సేవా సంస్థల నుంచి నూతన ప్రాజెక్ట్‌కు దరఖాస్తులు వెబ్ పోర్టల్ www. ngo. tribal. gov. in లో ఈ నెల 15వ తేదీ లోపు సమర్పించాలని తెలిపారు.

300 ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటు



మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ కార్తీక్

నెల్లూరు రూరల్: జిల్లా వ్యాప్తంగా 300 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభిస్తున్నట్లు జాయింట్ కలెక్టర్ కార్తీక్ తెలిపారు. మంగళవారం కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ హాల్‌లో ధాన్యం మిల్లర్లతో జేసీ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం తరఫున రెండో వారం నుంచి ధాన్యం కొనుగోలు ఏర్పాటు చేసేందుకు అన్ని చర్యలు తీసుకున్నామన్నారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న 523 రైతుసేవా కేంద్రాలకు అనుసంధానంగా 300 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఉంటాయన్నారు. గోతాలు, హమాలీలు, రవాణా సదుపాయాలు ప్రభుత్వమే కల్పిస్తుందని, ఒక వేళ రైతులు సమకూర్చుకుంటే అందుకు సంబంధించిన నగదు చెల్లించడం జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో పౌరసరఫరాల సంస్థ డీఎం నరసింహారావు ఇతరులు పాల్గొన్నారు.

విప్ ధిక్కరించారు.. చర్యలు తీసుకోండి



బుచ్చి నగర పంచాయతీ ఎన్నికల అధికారి శ్రీధర్‌రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న నాయకులు

నెల్లూరు(పొగతోట): బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతీలో జరిగిన వైస్ చైర్మన్ ఎన్నికల్లో తమ పార్టీ విప్‌ను ధిక్కరించి ఇండిపెండెంట్‌గా పోటీ చేసిన వారికి ఓటేసిన 12 మంది కౌన్సిలర్లపై చర్యలు తీసుకోవాలని ఆ పార్టీ విప్ షాహుల్ కోరారు. ఈ మేరకు మంగళవారం నగరంలోని డీపీఓ కార్యాలయంలో బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతీ ఎన్నికల ప్రిసైడింగ్ అధికారి, డీపీఓ శ్రీధర్‌రెడ్డికి పార్టీ నాయకులతో కలిసి వినతి పత్రం ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ విప్‌ను, రాజ్యాంగాన్ని ధిక్కరించిన కౌన్సిలర్లు నాగరాజు, పెంచలప్రత్యూష, సుప్రజ, రహమత్‌బాషా, నస్రీన్, మల్లారెడ్డి, సత్యనారాయణ, లక్ష్మీకాంతమ్మ, ప్రసాద్, లలితమ్మ, శ్రీదేవి, వీఎస్‌రెడ్డి తదితరులను అనర్హులుగా ప్రకటిస్తూ చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు వీరి చలపతి తదితరులు పాల్గొన్నారు.

మూడు యూనిట్లలో విద్యుదుత్పత్తి

ముత్తుకూరు: మండలంలోని నేలటూరులో ఉన్న శ్రీదామోదరం సంజీవయ్య ఏపీజెన్‌కో ప్రాజెక్ట్‌లో మూడు యూనిట్ల నుంచి విద్యుదుత్పత్తి జరుగుతున్నట్లు ఇంజినీర్లు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 1వ యూనిట్లో 560, 2వ యూనిట్లో 580, 3వ యూనిట్లో 690 మెగావాట్ల విద్యుదుత్పత్తి జరుగుతుందని వివరించారు.

అగ్రిగోల్డ్ భూముల్లో టీడీపీ పుష్ప

జామాయిల్ కర్రను కాజేస్తున్న వైనం

- అనుచరులను పెట్టి అక్రమ రవాణా చేయిస్తున్న ఎమ్మెల్యే
- పట్టించుకోని రెవెన్యూ, పోలీస్, సీఐడీ
- అక్రమ సంపాదనలో వాటాకు లోకేశ్ అనుచరుడు పేచీ
- పట్టించుకోని ఎమ్మెల్యే అనుచరులు
- తహసీల్దార్‌కు, ఎస్పీ కార్యాలయానికి ఫిర్యాదులు
- స్పందన లేకపోవడంతో నేరుగా రంగ ప్రవేశం
- కర్ర రవాణా లారీకి అడ్డంగా కారు పెట్టి మంత్రాంగం
- కారు అద్దాలు పగులకొట్టిన ఎమ్మెల్యే వర్గీయులు

ఉదయగిరి నియోజకవర్గంలో టీడీపీ నేతలు పుష్పాను మించిపోయారు. అగ్రిగోల్డ్ ఆస్తులు తమ్ముళ్లకు అక్షయపాత్రగా మారాయి. అనాధీనంగా పడి ఉన్న ఆ సంస్థ భూముల్లోని రూ.కోట్ల విలువైన జామాయిల్ కర్రను కొల్లగొట్టేస్తున్నారు. సీఐడీ పర్యవేక్షణలో ఉన్న ఈ భూముల్లోని సంపదను స్థానిక ప్రజాప్రతినిధి అనుచరులను అడ్డం పెట్టుకుని దోచుకుంటున్నారు. మంత్రి లోకేశ్ అనుచరుడు అక్రమ సంపాదనలో వాటా ఇవ్వాలంటూ డిమాండ్ చేశాడు. ఈ వ్యవహారంలో తగ్గేదే లేదంటూ.. ప్రజాప్రతినిధి వర్గం తెగేసి చెప్పడంతో తమ్ముళ్ల మధ్య చిచ్చు రేగింది.



కనియంపాడు అగ్రిగోల్డ్ భూముల్లో లారీకి లోడ్ చేస్తున్న జామాయిల్ కర్ర

సాక్షి టాస్క్‌ఫోర్స్: ప్రభుత్వ అధీనంలో ఉన్న అగ్రిగోల్డ్ భూముల్లో సంపద దోచుకునేందుకు తమ్ముళ్లు పుష్పా సినిమా తరహాలో వ్యవహరిస్తున్నారు. ఈ పరిణామాలు పచ్చనేతల మధ్య చిచ్చు రేపాయి. వరికుంటపాడు మండలం భాస్కరపురం రెవెన్యూ పరిధిలో అగ్రిగోల్డ్ సంస్థ భూములు ఉన్నాయి. ఆ భూముల్లోని విలువైన జామాయిల్ కర్రను ఎమ్మెల్యే కాకర్ల సురేష్ తన అనుచరులను పెట్టి అక్రమంగా నరికి స్వాహా చేస్తున్నారు. పది రోజులుగా జరుగుతున్న ఈ దందాపై ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాల్లో విస్తృతంగా కథనాలు వస్తున్నాయి. పుష్పా తరహాలో రాత్రి పగలు తేడా లేకుండా జామాయిల్ కర్ర అక్రమ రవాణా జరుగుతున్నా.. రెవెన్యూ, పోలీస్, సీఐడీ అధికార యంత్రాంగం కళ్లకు గంతలు కట్టుకున్నట్లు వ్యవహరిస్తోంది. టీడీపీ అధినాయకత్వం కూడా పట్టీపట్టనట్లు ఉండిపోయింది.



పగిలిన కారు అద్దం



జామాయిల్ చెట్ల నరికివేత

వాటా కోసం లోకేశ్ అనుచరుడు రచ్చ

అగ్రిగోల్డ్ సంపదను కాపాడి బాధితులకు న్యాయం చేయాల్సిన ప్రభుత్వం, అధికార యంత్రాంగం నోరు మెదపడం లేదు. దీన్ని అవకాశంగా తీసుకుని కంచే చేను మేసిన చందంగా ప్రజాప్రతినిధి తమ అనుచరుల ద్వారా 'కర్ర' స్కామ్‌కు పాల్పడుతున్నారు. రూ.కోట్లు విలువ చేసే కలప సంపదలో తన వాటా సంగతి ఏమిటంటూ మంత్రి లోకేశ్ అనుచరుడు రాష్ట్ర టీడీపీ కార్యదర్శి బి.వెంగళరావు (ఇతని సొంతూరు దుత్తలూరు మండలం ఏరుకొల్లు) పేచీ పెట్టి.. రచ్చ చేస్తున్నాడు. నాలుగు రోజుల క్రితం కర్ర నరికే ప్రాంతం కనియంపాడు వెళ్లి మకాం పెట్టారు. ఈ విషయం తెలుసున్న ఎమ్మెల్యే అనుచరుడు మండలానికి చెందిన ఓ టీడీపీ నేతను రంగంలోకి దింపి, సమస్య లేకుండా రాజీ ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో లోకేశ్ అనుచరుడు సోమవారం నేరుగా అక్రమంగా జామాయిల్ కర్ర నరికే కనియంపాడు భూముల్లోకి మరో వ్యక్తితో కలిసి కారులో వెళ్లారు. అక్కడ లోడ్ చేసి బయలు దేరేందుకు సిద్ధంగా ఉన్న లారీ ముందు దారికి అడ్డంగా కారు పెట్టాడు. తహసీల్దార్‌కు ఫిర్యాదు చేసేందుకు కార్యాలయానికి వెళ్లి తిరిగి వచ్చే లోపు ఎమ్మెల్యే అనుచరులు కారు అద్దాలు ధ్వంసం చేశారు. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు సమాచారం.

భూముల్లో రూ.50 కోట్ల సంపద

అగ్రిగోల్డ్ సంస్థ డిపాజిట్‌దార్ల నుంచి సేకరించిన నగదుతో ఉదయగిరి నియోజకవర్గంలో వరికుంటపాడు మండలం భాస్కరపురం, కనియంపాడు, తూర్పుపాళెంతో పాటు దుత్తలూరు, వింజమూరు, ఉదయగిరి, సీతారామపురం, కలిగిరి మండలాల్లో 17 వేల ఎకరాల భూములు కొనుగోలు చేశారు. అందులో దాదాపు 15 వందల ఎకరాల్లో జామాయిల్ సాగు చేశారు. ఈ భూముల్లో సాగులో ఉన్న కర్ర సంపద సుమారు రూ.50 కోట్లు ఉంటుందని అంచనా. వీటిలో ప్రస్తుతం వరికుంటపాడు మండలంలో రూ.10 కోట్లు విలువ చేసే జామాయిల్ కర్రను నరికి స్వాహా చేస్తున్నారు.

దోపిడీని ప్రశ్నించేదెవరు?

ప్రజల సొత్తును అక్రమార్కులు దోచేస్తుంటే వారి ఆస్తులకు రక్షణ కల్పించాల్సిన ప్రభుత్వం, పోలీసులు, సీఐడీ, రెవెన్యూ యంత్రాంగం నోరు మెదపడం లేదు. బాధితుల తరఫున ఉద్యమాలు చేసిన ప్రతిపక్ష పార్టీలు, ప్రజా సంఘాలు మౌనవ్రతం పాటిస్తున్నాయి. చిన్న తప్పు చేస్తే పోలీస్ స్టేషన్ల చుట్టూ తిప్పే పోలీసు యంత్రాంగం కళ్లెదుటే దోపిడీ జరుగుతున్నా పట్టించుకోకపోవడం చూసి ప్రజలు మండిపడుతున్నారు.

ఆ కార్పొరేటర్లు ప్రజల దృష్టిలో ద్రోహులు



మాట్లాడుతున్న కాకాణి గోవర్ధన్‌రెడ్డి, చిత్రంలో మాజీ ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి, ఎమ్మెల్సీ చంద్రశేఖరరెడ్డి, ఖలీల్ అహ్మద్, కార్పొరేటర్లు

- ప్రజాభిమానాన్ని బట్టి గెలుపోటములు సహజం
- కానీ అడ్డదారిలో అధికారం కోసం టీడీపీ తహతహ
- వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లను తమ పార్టీగా చెప్పుకోవడానికి సిగ్గులేదా?
- పార్టీ కోసం నిలబడిన కార్పొరేటర్లకు భవిష్యత్‌లో సముచిత పదవులు
- మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

నెల్లూరు (బారకాసు): వైఎస్సార్‌సీపీ ఎన్నికల గుర్తుపై గెలుపొంది అధికారం కోసం టీడీపీలో చేరిన కార్పొరేటర్లు ప్రజల దృష్టిలో ద్రోహులే అని మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక డైకస్‌రోడ్డులోని పార్టీ జిల్లా కార్యాలయంలో ఎమ్మెల్సీ, పార్టీ నెల్లూరు సిటీ నియోజకవర్గ ఇన్‌చార్జి పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి, కార్పొరేటర్లతో కలిసి ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. రాజకీయాల్లో ప్రజాభిమాన్ని బట్టి గెలుపోటములు సహజమన్నారు. జూదంలో ఓడిన పాండవులు కురుక్షేత్రంలో గెలిచారని.. ఓటమి అనేది శాశ్వతం కాదన్నారు. కానీ నెల్లూరు కార్పొరేషన్ డిప్యూటీ మేయర్, బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతీ వైస్ చైర్మన్ల ఎన్నికల్లో కనీసం బలం లేని టీడీపీ అడ్డదారిలో అధికారం కోసం చేసిన నీచ రాజకీయాలను, టీడీపీ వ్యవహరిస్తున్న తీరును ప్రజలు గమనిస్తున్నారన్నారు. టీడీపీ ఎప్పుడూ ప్రజాబలంతో అధికారంలోకి రాలేదని, గతంలో జెడ్పీ చైర్మన్, నెల్లూరు కార్పొరేషన్ ఎన్నికల్లోనూ ఇదే తరహాలో ప్రయత్నించి భంగపడిందని గుర్తు చేశారు. వైఎస్సార్‌సీపీలో గెలిచిన వాళ్లను ప్రలోభపెట్టి తమ పార్టీ వాళ్లని చెప్పుకోవడానికి టీడీపీ సిగ్గుపడాలన్నారు.

టీడీపీ నీచ రాజకీయాలు ప్రజలకు తెలియజేయాలనే..

నెల్లూరు కార్పొరేషన్‌లో టీడీపీ సింబల్‌పై గెలిచిన ఒక్క కార్పొరేటర్ కూడా లేరు. బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతీలో ఆ పార్టీకి ఇద్దరే కౌన్సిలర్లు ఉన్నారు. నిన్న జరిగిన ఎన్నికల్లో తమ పార్టీ నుంచి కార్పొరేటర్లను, కౌన్సిలర్లను ప్రలోభాలకు గురి చేసి, భయపెట్టి తీసుకెళ్లి తమ పార్టీ వారని చెప్పుకుంటూ చేస్తున్న నీచ రాజకీయాలను ప్రజలకు తెలియజేయాలని తాము పోరాటం చేస్తున్నామన్నారు. తమకు బలం లేదని వెనకడుగు వేసే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. టీడీపీ బీఫారం ఇచ్చే సాహసం కూడా చేయలేదన్నారు. వైఎస్సార్‌సీపీ నుంచి వెళ్లిన కార్పొరేటర్‌కే డిప్యూటీ మేయర్ పదవి ఇచ్చారని చెప్పారు. ఇది తమ పార్టీ నైతిక విజయమన్నారు. తమ పార్టీ విధానాలు నచ్చలేదని చెప్పే కార్పొరేటర్లకు చిత్తశుద్ధి ఉంటే తమ పదవికి రాజీనామా చేసి, మళ్లీ ఎన్నికల్లో పాల్గొనాలని సవాల్ విసిరారు. డిప్యూటీ మేయర్ ఎన్నిక సమయంలో టీడీపీ బీఫారం ఇవ్వలేదని చెప్పడానికి కూడా ప్రిసైడింగ్ అధికారిగా ఉన్న జాయింట్ కలెక్టర్ భయపడ్డారన్నారు. విప్ గురించి కనీస పరిజ్ఞానం లేని వ్యక్తులు టీడీపీలో ఉన్నారని చెప్పారు. డిప్యూటీ మేయర్ ఎన్నికకు మంత్రి నారాయణ ముఖం చాటేశారంటే.. ఎక్కడ పరువు పోతుందో అనే భయమన్నారు. వైఎస్సార్‌సీపీ కోసం నిలబడిన కార్పొరేటర్లకు భవిష్యత్‌లో సముచిత స్థానం కచ్చితంగా కల్పిస్తామని వారికి భరోసా ఇస్తున్నామన్నారు. నైతికంగా వైఎస్సార్‌సీపీ విజయం సాధిస్తే అనైతికంగా టీడీపీ గెలిచి చంకలు గుద్దుకుంటుందన్నారు. తమ పార్టీ జారీ చేసిన విప్ దెబ్బకు టీడీపీ భయపడిందన్నారు. రాష్ట్రంలో డిప్యూటీ మేయర్ల ఎన్నికల్లో పోలీసులు చేతులెత్తేశారని, టీడీపీ, జనసేన అరాచకాలు చేసినా వారు పట్టించుకోలేదన్నారు. నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్, బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతీల్లో జరిగిన ఎన్నికల్లో విప్ ధిక్కరించిన వారిపై వేటు వేయాలని ఎన్నికల అధికారులను కలుస్తున్నామన్నారు. వైఎస్సార్‌సీపీ ఎన్నికల గుర్తుపై గెలుపొంది టీడీపీలోకి వెళ్లిన కార్పొరేటర్లు, కౌన్సిలర్లు పదవిలో ఉన్నప్పుడే అనర్హత వేటు వేసేలా న్యాయస్థానాన్ని కోరుతామన్నారు.



ప్రిసైడింగ్ అధికారి, జేసీ కార్తీక్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్సీ చంద్రశేఖర్‌రెడ్డి, కార్పొరేటర్లు, నాయకులు

అనర్హులుగా ప్రకటించండి

- విప్ ఉల్లంఘించిన కార్పొరేటర్లపై చర్యలు తీసుకోవాలి
- ఎన్నికల ప్రిసైడింగ్ అధికారికి ఎమ్మెల్సీ చంద్రశేఖర్‌రెడ్డి వినతి

నెల్లూరు రూరల్: నెల్లూరు నగర పాలక సంస్థ డిప్యూటీ మేయర్ ఎన్నికల్లో విప్ ఉల్లంఘించిన వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లను అనర్హులుగా ప్రకటించాలని కోరుతూ ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి పార్టీ నేతలతో కలిసి కలెక్టరేట్‌లో మంగళవారం ఎన్నికల ప్రిసైడింగ్ అధికారి, జేసీ కె కార్తీక్‌కు వినతి పత్రం అందజేశారు. ఎమ్మెల్సీ చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ డిప్యూటీ మేయర్ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ జారీ చేసిన విప్‌ను ఉల్లంఘించి తమ పార్టీ అభ్యర్థికి కాకుండా ఇండిపెండెంట్ అభ్యర్థికి ఓటు వేశారన్నారు. వైఎస్సార్‌సీపీ ఎన్నికల గుర్తుపై గెలిచిన ఈ కార్పొరేటర్లు విప్ ఉల్లంఘించాని, వారిపై అనర్హత వేటు వేయాలని కోరుతున్నామన్నారు. అదే విధంగా డిప్యూటీ మేయర్ ఎన్నికను రద్దు చేయాలని కోరుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మైనార్టీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఖలీల్ అహ్మద్, హంజా హుస్సేనీ, కార్పొరేట ర్లు కరిముల్లా, వేలూరు మహేష్, ఊటుకూరు నాగార్జున, నేతాజీ సుబ్బారెడ్డి, నీలి రాఘవరావు, బొబ్బల శ్రీనివాస్‌యాదవ్, కామాక్షిదేవి, గుంజి జయలక్ష్మి, నాయకులు పేర్నాటి కోటేశ్వరరెడ్డి, రవూఫ్, మున్వర్, అలీం తదితరులు పాల్గొన్నారు.

స్ట్రెచర్ పట్టే దిక్కులేదు

200కు పైగా ఉండాల్సిన ఎంఎన్‌ఓలు, ఎఫ్ఎన్‌ఓలు

- ఉండేది 20 మంది మాత్రమే
- రాత్రి షిఫ్ట్‌లో అత్యవసర విభాగం నుంచి వార్డుల దాక ఒక్కరే ఎంఎన్‌ఓ
- అనధికారికంగా శానిటేషన్ సిబ్బందితో ఎఫ్ఎన్‌ఓ, ఎంఎన్‌ఓ విధులు
- శానిటేషన్ సిబ్బందిని తప్పించడంతో స్తంభించిన సేవలు

పెద్దాస్పత్రిలో రోగుల స్ట్రెచర్ పట్టేందుకు దిక్కులేని పరిస్థితి ఏర్పడింది. వార్డుల్లో ఉండే రోగులను వీల్ చైర్‌లో రక్త, స్కాన్, ఎక్స్‌రే వంటి పరీక్షల గదుల వద్దకు తీసుకెళ్లేందుకు ఉండాల్సిన ఎఫ్ఎన్‌ఓ, ఎంఎన్‌ఓ సిబ్బంది తగినంత మంది లేరు. ఉండాల్సిన సిబ్బందిలో కేవలం పది శాతం మంది మాత్రమే విధులు నిర్వర్తిస్తున్నారు. రాత్రి షిఫ్ట్‌లో ఒకే ఒకరు విధులు నిర్వహిస్తుండడం గమనార్హం.

నెల్లూరు (అర్బన్): పెద్దాస్పత్రిలో ఎంఎన్‌ఓలు (మేల్ నర్సింగ్ ఆర్డర్లీ), ఎఫ్ఎన్‌ఓ సిబ్బంది నియామకం లేకపోవడంతో రోగులను స్ట్రెచర్‌పై బంధువులే తీసుకెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇప్పటి వరకు శానిటేషన్ సిబ్బందిని అనధికారికంగా ఆ విధులకు ఉపయోగించుకున్న ఆస్పత్రి అధికార యంత్రాంగం ఉన్నఫళంగా వారిని ఆ విధుల నుంచి తప్పించింది. పెద్దాస్పత్రికి రోజుకు 1200 నుంచి 1300కి పైగా ఓపీ రోగులు వస్తున్నారు. 550 మంది వరకు ఇన్‌పేషెంట్లుగా చికిత్స పొందుతుంటారు. ఎంఆర్ఐ, సీటీ, 2డి ఎకో, అల్ట్రాసౌండ్, ఎక్స్‌రే, బయాప్సీ వంటి ఆధునిక పరీక్షలకు రోగులను ఆయా వార్డుల నుంచి స్ట్రెచర్లపై తీసుకెళ్లడానికి ఎంఎన్‌ఓలు విధులు నిర్వర్తించాలి. అయితే ఆస్పత్రి స్థాయి మేరకు ఇక్కడ 200 మందికి పైగా ఎఫ్ఎన్‌ఓలు, ఎంఎన్‌ఓలు చేయాల్సిన పనులు ప్రస్తుతం 20 మంది మాత్రమే చేస్తున్నారు. ఈ 20 మందిలో కూడా ఎక్కువ మంది అవుట్ సోర్సింగ్ సిబ్బంది మాత్రమే.

అన్ని సేవలకు శానిటేషన్ సిబ్బందే దిక్కు

ఇప్పటి వరకు ఆస్పత్రిలో శానిటేషన్ సిబ్బందే అన్ని సేవలకు దిక్కుగా మారారు. ఆర్‌ఓ ప్లాంట్ నిర్వాహకులుగా, ఆపరేషన్‌కు సంబంధించి రోగులకు ప్రిపరేషన్ చేయడం, స్ట్రెచర్, వీల్‌చైర్‌లు పట్టడం, యూరిన్ బ్యాగు క్లీన్ చేయడం వంటి అన్ని రకాల పనులు చేసేవారు. అయితే ఇటీవల శానిటేషన్ సిబ్బంది పనితీరు విషయమై సమాచార హక్కు చట్టం కింద వివరాలు కోరడం, ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయడంతో వారిని ప్రస్తుతం ఎఫ్ఎన్‌ఓ, ఎంఎన్‌ఓలుగా చేయొద్దని సూపరింటెండెంట్ ఆర్డర్ వేయడంతో రోగులకు అందాల్సిన సేవలన్నీ స్తంభించి పోయాయి.

64 వార్డులకు ఒక్కరే స్టాఫ్

పెద్దాస్పత్రిలో దాదాపు 64 వార్డులు ఉన్నాయి. ప్రధానంగా క్యాజువాలిటీ (అత్యవసర విభాగం) వద్దకు రోడ్ యాక్సిడెంట్, ఘర్షణలు, మందు తాగిన కేసులు, ట్రామా కేసులు వంటి అత్యవసర రోగులు వస్తున్నారు. సరాసరి రోజుకు క్యాజువాలిటీ ఒక్క విభాగానికే 60 మంది రోగులు ప్రమాద స్థితిలో వస్తున్నారు. వీరికి ప్రాథమిక వైద్యం చేయాలి. గాయాలను క్లీన్ చేసేందుకు సపోర్టింగ్ స్టాఫ్‌గా ఉన్న ఎంఎన్‌ఓలు, ఎఫ్ఎన్‌ఓలు సేవలందించాలి. తక్షణమే వార్డుల్లోని ఐసీయూ, ఇతర విభాగాలకు రోగులను చేర్చాలి. ఇలా చేర్చదామంటే ప్రధానంగా రాత్రి పూట ఒక్కరే ఎంఎన్‌ఓ ఉంటున్నారు. ఆ ఒక్కరూ క్యాజువాల్టీతో సహా వార్డుల్లో చూసుకోవాలి. వార్డు కెళితే క్యాజువాలిటీలో కేసు పట్టేందుకు ఇక ఎవరూ మిగలరు. దీంతో రోగి సహాయకులే ఎంఎన్‌ఓలుగా అవతారమెత్తుతున్నారు.

క్షణం తీరికలేదాయే...

ఎంఎన్‌ఓలు, ఎఫ్ఎన్‌ఓలు లేకపోవడంతో ఉన్న 20 మంది మూడు షిఫ్ట్‌ల్లో పని చేయాలి. వీరిలో కొంత మంది ఎంసీహెచ్ బ్లాక్‌లో పని చేయాలి. మిగిలిన ఒకరు అర క్యాజువాలిటీతో పాటు ఐపీ భవనంలోని వార్డుల్లో క్షణం తీరిక లేకుండా పని చేస్తున్నారు. ఒక చోట కూడా పట్టుమని ఐదు నిమిషాలు నిలబడే పరిస్థితి లేదు. ప్రధానంగా ఐపీ బిల్డింగ్‌లోని అన్ని వార్డులకు, క్యాజువాలిటీకి కలిపి రాత్రి పూట షిఫ్ట్‌లో ఉన్న ఒకరే ఎంఎన్‌ఓ విధులు నిర్వర్తిస్తున్నాడు. ఎఫ్ఎన్‌ఓ, ఎంఎన్‌ఓలు ఎంత మంది అదనంగా అవసరమో డీఎంఈ ద్వారా ఫైల్‌ను హెల్త్ సెక్రటరీ వయా ఫైనాన్స్ సెక్రటరీకి పంపాలని ఉంది. అయితే ఇప్పటి వరకు పెద్దాస్పత్రి సూపరింటెండెంట్‌గా పని చేసిన ఏ అధికారి కూడా ఆ ప్రయత్నం చేయలేదు.



ఎఫ్ఎన్‌ఓలు లేకపోవడంతో రోగిని పేషెంట్ కుటుంబ సభ్యుడే వీల్ చైర్‌లో నెట్టుకుని వెళ్తున్న దృశ్యం



వీల్ చైర్ దొరక్కఅతి కష్టంగా రోగిని దివ్యాంగుల శిబిరం వద్దకు తీసుకెళ్తున్న కుటుంబ సభ్యులు

నామమాత్రంగా హెచ్‌డీఎస్ కమిటీ

ఈ సమస్యను హాస్పిటల్ డెవలప్‌మెంట్ కమిటీ పట్టించుకోలేదు. ఈ కమిటీ కో ఆర్డినేటర్, సభ్యులంతా కూటమి ప్రభుత్వంలోని ఎమ్మెల్యే అనుచరులే.. అయినా సమస్యను తీర్చేందుకు చొరవ తీసుకోలేదని రోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఇబ్బందులు లేకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు

జీఓ పరంగా పోస్టులు మంజూరు లేకపోవడంతో ఇబ్బంది తలెత్తిన మాట వాస్తవమే. అయితే ఉన్న వారిని క్రమపద్ధతిలో ఉపయోగించుకుని సేవలు ఆలస్యం కాకుండా చూస్తున్నాం. ఇక్కడి సమస్యలు తాము డీఎంఈ ద్వారా ప్రభుత్వానికి నివేదించాం. త్వరలోనే 100 మందిని కాంట్రాక్ట్ బేస్‌పై ఎఫ్ఎన్‌ఓలు, ఎంఎన్‌ఓలుగా నియమిస్తాం. అందుకు సంబంధించిన ఆదేశాలు డీఎంఈ ద్వారా రానున్నాయి. అప్పుడు ఇక ఇబ్బంది ఉండదు. – డాక్టర్ సిద్ధానాయక్, సూపరింటెండెంట్, పెద్దాస్పత్రి

క్లుప్తంగా

పర్యావరణ ప్రేమికురాలు.. వసంతమ్మ



మొక్కలు తీసుకొచ్చిన వసంతమ్మ

నెల్లూరు(పొగతోట): నెల్లూరులోని జిల్లా పరిషత్ కార్యాలయంలో అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న వసంతమ్మకు మొక్కల పెంపకమంటే ఎంతో ఇష్టం. పర్యావరణ పరిరక్షణలో భాగంగా సొంత నిధులను ఖర్చు పెట్టి కార్యాలయంలో మొక్కలు నాటుతున్నారు. జిల్లా పరిషత్ కార్యాలయంలో పూల మొక్కలు, క్రోటన్ మొక్కలు అధికంగా ఉన్నాయి. వాటిలో 70 శాతానికి పైగా వసంతమ్మ ఏర్పాటు చేసినవే. మొక్క ఎండిపోతే ఆ స్థలంలో మరొకటి నాటుతారు. ఆమె స్వయంగా నర్సరీకి వెళ్లి అందమైన పూలమొక్కలను తీసుకొచ్చి కార్యాలయంలో నాటుతున్నారు. కార్యాలయాన్ని పచ్చదనంగా ఉంచడంలో ఆమె చేస్తున్న చర్యలను అందరూ కొనియాడుతున్నారు. గులాబీలు, ఇతర అలంకరణ మొక్కలతో కార్యాలయం కళకళలాడుతోంది. ఉదయాన్నే కార్యాలయానికి వచ్చి సిబ్బందితో పాటు మొక్కలకు నీళ్లు పోయడం, వాటి సంరక్షణకు ప్రత్యేక చొరవ తీసుకుంటున్నారు. కార్యాలయంలో పనిచేస్తున్న సిబ్బంది ఎవరైనా ఆర్థిక ఇబ్బందుల్లో ఉంటే వారికి చేయూతనిస్తూ ఆదుకుంటున్నారు. మొక్కల ప్రేమికురాలు శాంతమ్మను ఉద్యోగులందరూ అభినందిస్తున్నారు.

అదరగొడుతున్న వెటరన్



ప్రాక్టీస్ చేస్తున్న కోటేశ్వరమ్మ

వయోభారం శరీరానికే కాని సంకల్పానికి కాదని 76 ఏళ్ల వెటరన్ క్రీడాకారిణి ఏనుగుల కోటేశ్వరమ్మ నిరూపిస్తోంది. ఆమె అంతర్జాతీయ క్రీడాకారిణిగా రాణిస్తోంది. పోటీలకు వెళితే.. పతకం దక్కాల్సిందే. రాష్ట్ర, జాతీయ స్థాయిలోనూ ప్రతిభ చూపింది. ఫిజికల్ డైరెక్టర్‌గా ఎందరినో క్రీడాకారులుగా తీర్చిదిద్దిన ఆమె ఉద్యోగ విరమణ అనంతరం క్రీడాకారిణిగా రాణిస్తోంది.



స్వీడన్‌లో పతకం అందుకుంటూ..

- క్రీడల్లో ప్రతిభ చాటుతున్న కావలికి చెందిన కోటేశ్వరమ్మ
- రాష్ట్ర స్థాయిలో 125, జాతీయ స్థాయిలో 115 పతకాలు
- అంతర్జాతీయ స్థాయిలో 17..

కావలి: ఎనిమిది పదుల వయసుకు దగ్గరవుతున్నా.. సంకల్పంతో ముందు సాగుతోంది కావలి పట్టణానికి చెందిన ఏనుగుల కోటేశ్వరమ్మ. ఆమె జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో అసమాన క్రీడా నైపుణ్యాన్ని ప్రదర్శిస్తోంది. అనేక పతకాలు సాధించి కావలి కీర్తి ప్రతిష్టలను ప్రపంచ స్థాయిలో ఇనుమడింపజేస్తోంది. కావలిలోని జవహర్ భారతి కళాశాలలో ఫిజికల్ డైరెక్టర్ ఉద్యోగిగా జవహర్ భారతి మైదానంలో క్రీడాకారులకు శిక్షణ ఇచ్చారు. ఉద్యోగ విరమణ చేసినప్పటికీ క్రీడలపై ఉన్న ఆసక్తితో పలు జాతీయ, అంతర్జాతీయ క్రీడా పోటీల్లో పాల్గొంటున్నారు.

పోటీ పడుతూ..

కోటేశ్వరమ్మ దేశ, విదేశాల్లో మాస్టర్ వెటరన్స్ అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొంటూ పతకాలు కొల్లగొడుతున్నారు. రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో షాట్‌పుట్, హేమర్ త్రో, డిస్క్ త్రో, 100, 200 మీటర్ల పరుగు పోటీల్లో బంగారు, వెండి, కాంస్య పతకాలు సాధించారు. ఇప్పటి వరకు రాష్ట్ర స్థాయిలో 125, జాతీయ స్థాయిలో 115, అంతర్జాతీయ స్థాయిలో 17 పతకాలు సాధించారు. వీటిలో బంగారు పతకాలే ఎక్కువ కావడం గమనార్హం.

ఇదీ నేపథ్యం

మొదటి నుంచి క్రీడా పోటీల్లో పాల్గొనేలా కోటేశ్వరమ్మను తల్లిదండ్రులు, పాఠశాల ఉపాధ్యాయులు ప్రోత్సహించారు. హైస్కూల్లో ఆమెదే హవా. తర్వాత తాను చదివిన జవహర్ భారతి కళాశాల తరఫున ఆడి పతకాలు పంట పండించింది. చదువు పూర్తయిన తర్వాత జవహర్ భారతి కళాశాలలోనే 1975లో ఫిజికల్ డైరెక్టర్ (పీడీ)గా ఉద్యోగంలో చేరింది. పీడీగా 2006లో ఉద్యోగ విరమణ చేసిన ఆమె క్రీడా పోటీల్లో పాల్గొంటున్నారు.

పింఛన్ సొమ్ముతోనే..

కోటేశ్వరమ్మ తనకు వచ్చే పింఛన్‌ను దాచుకొని అంతర్జాతీయ క్రీడా పోటీల్లో పాల్గొంటోంది. 2014 నుంచి అంతర్జాతీయ క్రీడా పోటీల్లో పాల్గొనడం మొదలు పెట్టారు. 2014, 2015, 2016, 2017 సంవత్సరాల్లో జపాన్, శ్రీలంక, మలేసియా, సింగపూర్ దేశాల్లో జరిగిన మాస్టర్ అథ్లెటిక్ పోటీల్లో ప్రతిభ చూపారు. 2019లో ఆస్ట్రేలియాలో జరిగిన పోటీల్లో పాల్గొన్నారు.

గతేడాది

స్వీడన్‌లో గతేడాది ఆగస్టు 13 నుంచి 25వ తేదీ వరకు జరిగిన ప్రపంచ స్థాయి మాస్టర్ అథ్లెటిక్ పోటీల్లో 110 దేశాల నుంచి 12,000 మంది క్రీడాకారులు విచ్చేశారు. హేమర్ త్రోలో అన్ని రకాల వడపోతలు ముగిసే సమయానికి 27 మంది అర్హత సాధించారు. వీరిలో అంతిమంగా 8 మంది పోటీ పడ్డారు. అందులో కోటేశ్వరమ్మ ఒకరు. ఆమెరికా, జర్మనీ, ఇండియా పతకాలు సాధించాయి. కోటేశ్వరమ్మకు రజత పతకం వచ్చింది.

కోనలో వైభవంగా రథసప్తమి



సూర్యప్రభ వాహనంపై లక్ష్మీనరసింహుడు



బంగారు గరుడ వాహనంపై శ్రీవారు

- సప్త వాహనాలపై లక్ష్మీనరసింహుడి ఊరేగింపు

రాపూరు: జిల్లాలో ప్రముఖ పుణ్య క్షేత్రమైన పెంచలకోనలో మంగళవారం రథసప్తమి వేడుకలు వైభవంగా జరిగాయి. ఒకేరోజు ఏడు వాహనాలపై పెనుశిల లక్ష్మీ నరసింహస్వామి ఊరేగింపు నిర్వహించడం వల్ల ఇది ఒకరోజు బ్రహ్మోత్సవంగా ప్రసిద్ధి పొందింది. రథసప్తమి పర్వదినాన్ని పురస్కరించుకుని తెల్లవారుజామున 4 గంటలకు శ్రీవారి మూలమూర్తికి అభిషేకం చేశారు. ఉదయం ఆరు గంటలకు శ్రీవారి ఉత్సవ విగ్రహాన్ని సూర్యప్రభ వాహనంపై ఉంచి వివిధ రకాల పుష్పాలు, ఆభరణాలతో శోభాయమానంగా అలంకరించి కోన మాడవీధుల్లో క్షేత్రోత్సవం చేశారు. 8 గంటలకు స్వామి, ఆదిలక్ష్మీదేవి, చెంచులక్ష్మీదేవిల ఉత్సవ విగ్రహాలను శేషవాహనంపై కొలువుదీర్చి క్షేత్రోత్సవం, 10 గంటలకు లక్ష్మీనరసింహుడిని సింహ వాహనంపై, 12 గంటలకు స్వర్ణ (బంగారు) గరుడ వాహనంపై ఉంచి కోన తిరువీధుల్లో క్షేత్రోత్సవం నిర్వహించారు. మధ్యాహ్నం రెండు గంటలకు పుష్కరిణి సుదర్శన చక్రానికి పాలు, తేనె, పసుపు, చందనం, కొబ్బరినీరు, పెరుగు, నెయ్యి, వివిధ రకాల సుగంధ ద్రవ్యాలు, పండ్లు పుష్పాలతో అభిషేకం నిర్వహించారు. అనంతరం సుదర్శన చక్రాన్ని పుష్కరిణిలో చక్రస్నానం చేయించారు. సాయంత్రం 4 గంటలకు బంగారు హనుమంత వాహనంపై, ఆరు గంటలకు అశ్వవాహనంపై, రాత్రి 8 గంటలకు చంద్రప్రభ వాహనంపై నృసింహుడిని కొలువుదీర్చి కోన మాడవీధుల్లో క్షేత్రోత్సవం నిర్వహించారు. బ్రహ్మోత్సవాల్లో రోజూ స్వామిని ఒక్కో వాహనంపై ఊరేగిస్తారు. రథసప్తమి నాడు సప్త వాహనాలపై స్వామిని ఊరేగించడంతో భక్తులు పెద్దసంఖ్యలో విచ్చేశారు. పెంచలకోన క్షేత్రం గోవింద నామస్మరణతో మారుమోగింది. కార్యక్రమాల్లో ఆలయాధికారులు, పాల్గొన్నారు.

నిమ్మ ధరలు (కిలో)



పెద్దవి :	రూ.32
సన్నవి :	రూ.20
పండ్లు :	రూ.11

పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్:	రూ.118	లేయర్	రూ.85
బ్రాయిలర్ చికెన్:	రూ.214	స్కిన్‌లెస్ చికెన్:	రూ.238
లేయర్ చికెన్:	రూ.145		

రాష్ట్ర పండగగా రథసప్తమి

- మంత్రి ఆనం రామనారాయణరెడ్డి

నెల్లూరు(బృందావనం): రథసప్తమిని రాష్ట్ర పండగగా ప్రకటించినట్లు రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి తెలిపారు. రథసప్తమిని పురస్కరించుకుని నెల్లూరు మూలాపేటలో ఉన్న భువనేశ్వరి సమేత మూలస్థానేశ్వరస్వామిని, సూర్య భగవానుడిని మంగళవారం ఆయన దర్శించుకున్నారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ అరసవిల్లిలోని సూర్యభగవానుడి ఆలయం నుంచి రాష్ట్ర వ్యాప్తంగా రథసప్తమి వేడుకలకు శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. నెల్లూరు జిల్లాలోని 18 ప్రసిద్ధ ఆలయాల పునఃనిర్మాణానికి రూ.38 కోట్లు మంజూరు చేసినట్లు వెల్లడించారు.

రాష్ట్రంలో అస్తవ్యస్తంగా విద్యారంగం

- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు



మాట్లాడుతున్న శ్రీనివాసరావు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): 'రాష్ట్రంలో విద్యారంగం అస్తవ్యస్తంగా ఉంది. దీనికి నిధులు పెంచి, ప్రభుత్వ విద్యాసంస్థలను బలోపేతం చేయాలి' అని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు అన్నారు. నెల్లూరులోని బాలాజీ నగర్‌లో ఉన్న సీపీఎం జిల్లా కార్యాలయంలో మంగళవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. చంద్రబాబు విజన్ 2047 పేరుతో అనవసరపు ఆర్భాటం చేస్తున్నారని విమర్శించారు. ప్రతి సంవత్సరం రెండు లక్షల మంది ప్రభుత్వ పాఠశాలలకు దూరమవుతూ, ప్రైవేట్ స్కూళ్లలో చేరుతున్నారని చెప్పారు. కూటమి ప్రభుత్వం తల్లికి వందనం ఇవ్వకపోవడంతో పేద విద్యార్థుల పరిస్థితి అగమ్యగోచరంగా తయారైందన్నారు. రాష్ట్రంలో ప్రభుత్వ రంగ కళాశాలలు 160 మాత్రమే ఉన్నాయని వీటిల్లో 80 వేలకు మించి విద్యార్థులు చదవడంలేదని, ఎయిడెడ్ కళాశాలలు మూతపడడం, ఫీజు రీయింబర్స్‌మెంట్ రాకపోవడంతో సామాన్య, మధ్య తరగతి విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. రాష్ట్ర బడ్జెట్‌లో విద్యారంగానికి ప్రభుత్వం పెద్దపీట వేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మోహన్‌రావు, మాదాల వెంకటేశ్వర్లు, రెహానా బేగం, అజయ్‌కుమార్, పుల్లయ్య, వెంగయ్య పాల్గొన్నారు.

'పీఎం సూర్యఘర్'పై ప్రత్యేక దృష్టి

- ఎస్‌ఈ విజయన్



మాట్లాడుతున్న ఎస్‌ఈ

నెల్లూరు(వీఆర్సీసెంటర్): 'పీఎం సూర్యఘర్ ముఫ్త్ బిజిలీ యోజనపై ప్రత్యేక దృష్టి సారించాలి. సోలార్ విద్యుత్‌ను ప్రతిఒక్కరూ వినియోగించి విజన్ – 2047లో భాగస్వాములవుదాం' అని ఏపీ ఎస్పీడీసీఎల్ జిల్లా సర్కిల్ ఎస్‌ఈ విజయన్ అధికారులకు పిలుపునిచ్చారు. నెల్లూరులోని విద్యుత్ భవన్‌లో మంగళవారం నెల్లూరు టౌన్ విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బందితో ఎస్‌ఈ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పథకం కోసం మొదట రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సి ఉంటుందన్నారు. ఈ ప్రక్రియకు నగదు చెల్లించవచ్చని లేదా బ్యాంక్ ద్వారా రుణం తీసుకోవచ్చన్నారు. సమావేశంలో ఈఈలు శేషాద్రి బాలచంద్ర, శ్రీధర్, సోమశేఖర్‌రెడ్డి, డీఈఈలు అశోక్, సునీల్, కిరణ్, మునీంద్ర, ఏఈలు పాల్గొన్నారు.

శేషజీవితం హాయిగా గడపాలి : ఎస్పీ



ఉద్యోగ విరమణ చేసిన సిబ్బందితో ఎస్పీ, పోలీస్ అధికారులు

నెల్లూరు(క్రైమ్): పోలీస్ శాఖలో సుదీర్ఘకాలం సేవలందించి ఉద్యోగ విరమణ పొందిన సిబ్బంది శేషజీవితం కుటుంబసభ్యులతో హాయిగా గడపాలని ఎస్పీ జి.కృష్ణకాంత్ ఆకాంక్షించారు. కావలి ఒకటో పట్టణ ఎస్సై ఎం.అంబేడ్కర్, పీసీఆర్, బిట్రగుంట, దగదర్తి ఏఎస్సైలు సీహెచ్ వి.కృష్ణయ్య, సీహెచ్ సుధాకర్, టి.మోహన్‌రావు, గూడూరు ఒకటో పట్టణ హోంగార్డు కె.శ్రీనివాసులు ఇటీవల ఉద్యోగ విరమణ చేశారు. మంగళవారం నెల్లూరు నగరంలోని ఉమేష్‌చంద్ర కాన్ఫరెన్స్ హాల్లో వారిని ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఆరోగ్యంపట్ల శ్రద్ధ వహించి వ్యాయామం చేస్తూ కుటుంబంతో సంతోషంగా గడపాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎస్పీ సీహెచ్ సౌజన్య, నగర డీఎస్పీ సింధుప్రియ, ఎస్బీ డీఎస్పీ శ్రీనివాసరావు, ఎస్బీ ఇన్‌స్పెక్టర్లు వెంకటేశ్వరరావు, ఏపీ పోలీస్ అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు మద్దిపాటి ప్రసాదరావు, శ్రీనివాసరెడ్డి, ఆర్‌ఐలు రాజారావు, పోల్‌రాజు పాల్గొన్నారు.

గ్రామ సమాఖ్యల అభివృద్ధికి చర్యలు

- డీఆర్‌డీఏ పీడీ నాగరాజకుమారి



మాట్లాడుతున్న పీడీ నాగరాజకుమారి

నెల్లూరు(పొగతోట): గ్రామ సమాఖ్యలు అభివృద్ధి చెందేలా చర్యలు తీసుకోవాలని డీఆర్‌డీఏ పీడీ నాగరాజకుమారి ఆదేశించారు. నెల్లూరులోని డీఆర్‌డీఏ సమావేశ మందిరంలో మంగళవారం సిబ్బందికి నిర్వహించిన శిక్షణా కార్యక్రమంలో పీడీ మాట్లాడారు. పొదుపు గ్రూపుల్లో జరిగే కార్యక్రమాలు, ఆర్థిక లావాదేవీలను వెబ్ పోర్టల్లో ఉంచాలన్నారు. దీనికి సంబంధించి ఎన్‌ఆర్‌ఎల్‌ఎం ప్రారంభించడం జరిగిందన్నారు. దీనిపై అకౌంటెంట్లు పూర్తిస్థాయిలో అవగాహన పెంచుకోవాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో మహిళలు పూర్తిస్థాయిలో అభివృద్ధి చెందేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. దీనికి సంబంధించి రుణాలు మంజూరు చేయడం, స్త్రీ నిధి, ఇతర కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. తీసుకున్న రుణాలు సద్వినియోగం చేసుకుని మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందేలా చర్యలు చేపట్టాలని తెలిపారు. కార్యక్రమంలో డీపీఎం కామాక్షి, ఫైనాన్స్ డీపీఎం రవికుమార్, ఏపీఎంలు, అకౌంటెంట్లు పాల్గొన్నారు.

చేపల మేత చోరీ

పొదలకూరు: మండలంలోని సూరాయపాళెనికి సమీపంలో చేపల గుంతలను నిర్వహిస్తున్న తూర్పుగోదావరి జిల్లాకు చెందిన ఇద్దరు వ్యక్తులకు చెందిన చేపల మేతను గుర్తుతెలియని వ్యక్తులు సోమవారం రాత్రి చోరీ చేశారు. బాధితులు బాబూరావు, మూర్తిలు మంగళవారం పోలీసులకు అందజేసిన ఫిర్యాదు మేరకు వివరాలు.. పది సంవత్సరాలుగా బాబూరావు, మూర్తిలు సూరాయపాళెం వద్ద భూములను లీజుకు తీసుకుని చేపల గుంతలను నిర్వహిస్తున్నారు. రూ.1.05 లక్షల విలువైన 70 బస్తాల మేతను నిల్వ చేసి ఉండగా గుర్తుతెలియని వ్యక్తులు అపహరించుకెళ్లారు.

విద్యార్థులకు నాణ్యమైన ఆహారం

- ఫుడ్ కమిషన్ చైర్మన్ విజయప్రతాప్‌రెడ్డి



వలేటివారిపాళెం మోడల్ స్కూల్లో పరిశీలిస్తున్న చైర్మన్

కందుకూరు/వలేటివారిపాళెం: మధ్యాహ్న భోజన పథకం కింద విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించాలని రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ విజయ్‌ప్రతాప్‌రెడ్డి సూచించారు. మంగళవారం ఆయన కందుకూరు నియోజకవర్గంలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కందుకూరు కేజీబీవీ పాఠశాలలో సమస్యలపై ఫిర్యాదులు వచ్చాయని తెలిపారు. దీంతో తనిఖీ చేశానని, పెద్దగా లోపాల్లేవని, పొరపాట్లను సరిచేసుకోవాలని సిబ్బందికి సూచించామన్నారు. అనంతరం ఆయన బాలుర, బాలికల ఉన్నత పాఠశాలలను తనిఖీ చేసి మధ్యాహ్న భోజనం నాణ్యతను పరిశీలించారు. పోకూరు డీలర్ షాపుపై ఫిర్యాదు వచ్చాయని, రేషన్ కొంటున్నారనే సమాచారంతో తనిఖీ చేసినట్లు తెలిపారు. పేద పిల్లలకు అందించే ఆహారం విషయంలో కక్కుర్తి పడొద్దన్నారు. కార్యక్రమంలో డివిజన్ ఉప విద్యాశాఖాధికారి వెంకట జానకీరామ్, ఎంఈఓ సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

- వలేటివారిపాళెం మండలంలోని మాలకొండ, అయ్యవారిపాళెం, చెర్లోపాళెం, చుండి గ్రామాల్లో అంగన్‌వాడీ కేంద్రాలను ఆయన పరిశీలించారు. చుండిలో గుడ్డు బరువు తక్కువగా ఉందని నిర్దేశించిన గ్రాముల ప్రకారం అందించకపోతే చర్యలు తీసుకుంటామని కాంట్రాక్టర్‌ను హెచ్చరించారు.